జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 8 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 6

## ప్రజల సంక్షేమమే ధ్యేయం... ఎమ్మెల్యే జారె

- దమ్మపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకు స్థాపన
- తహసీల్దార్ కార్యాల యంలో బోర్‌వెల్ ప్రారంభం
- మహిళాశక్తి క్యాంటీన్, మరుగుదొడ్ల నిర్మాణా నికి శ్రీకారం
- వనమహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



**దమ్మపేట, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గ్రామస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని

మిగతా 2 లో... ▸

## వర్షాభావ పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి



- పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి
- స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల
- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 7, (ప్రజాజ్యోతి)** వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులను చైతన్యపరచాలని, పంట కుంటల నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వానాకాలంలో పంటల సాగు, వర్షాభావ పరిస్థితులు, సాగునీటి లభ్యత, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, కొత్త సామాజిక భద్రతా

మిగతా 2 లో... ▸

- ఏకపక్షంగా ఒక్క బిడ్డర్‌కే టెండర్ ఖరారు చేయడం వెనుక భారీ కుట్ర
- రూ. 600 కోట్ల ప్రాజెక్టుకు 1.6 శాతం ఫీజు పేరుతో కోట్ల రూపాయల గోల్‌మాల్
- ఇప్పటికే రూ. 222 కోట్ల అప్పుల్లో ఉన్న కార్పొరేషన్‌పై మరో మోయలేని భారం
- సాంకేతిక, ఆర్థిక సామర్థ్యతలు లేని ప్రతిపాదనలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం
- ప్రపంచ బ్యాంకు నిధులపై స్థానిక ఎమ్మెల్యే, కమ్యూనిస్ట్ నేతల ద్వంద్వ వైఖరి
- అక్రమాల డీపీఆర్‌ను వెంటనే రీకాల్ చేసి కౌన్సిల్, ప్రజల ముందుంచాలి
- స్వతంత్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని కార్పొరేటర్ కంబంపాటి దుర్గాప్రసాద్ డిమాండ్




## డిపిఆర్ లోనే... రూ. 8 కోట్ల స్కాం


**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 7, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనుల నివేదిక (డిపిఆర్) తయారీ పేరుతో ఏకంగా రూ. 8 కోట్ల మేర స్కాం జరుగుతుందని, దీనిపై తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని 51వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ కంబంపాటి దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ కార్పొరేటర్ భీమ శ్రీవల్లి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం వారు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పారదర్శకతకు సంపూర్ణంగా పాతి పెట్టి, ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచిపెట్టే కుట్రలు సాగుతున్నాయని మండిపడ్డారు. రూ. 600 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన ఈ భారీ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియలో కేవలం ఒకే ఒక్క బిడ్డర్ లేదా సంస్థ మాత్రమే పోటీలో నిలవడం, ఏకపక్షంగా అదే సంస్థకు టెండర్ ఖరారు చేయడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. కేవలం డీపీఆర్ రూపకల్పన ఫీజు కింద 1.6 శాతం, అంటే సుమారు రూ. 9.60 కోట్ల భారీ మొత్తాన్ని చెల్లించేలా ఒప్పందం చేసుకోవడం పక్కా ప్రణాళికతో జరిగిన దోపిడీకి స్పష్టమైన నిదర్శనమని ధ్వజమెత్తారు. టెండర్ నిబంధనలు, వ్యయ అంచనాలు, బిడ్డర్ ఎంపిక వెనుక ఉన్న అక్రమాలపై స్వతంత్ర సంస్థతో

మిగతా 6 లో... ▸

## విద్యార్థికి టీసీ జారీ చేయడంలో జాప్యం

- ఎంఈఓ నిర్లక్ష్యంపై ఆరోపణలు.
- విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటమా..?
- టీసీ ఇవ్వని పాఠశాలపై చర్యలు ఎక్కడ..?
- టీసీ జారీపై ఉన్నతాధికారుల జోక్యం కోరిన జక్కుల లింగేశ్వర్.






**పాల్వంచ, ఆగస్టు 7, ప్రజాజ్యోతి:** రెజీనా పాఠశాలలో చదివిన ఓ విద్యార్థికి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ) ఇప్పించేందుకు సంబంధిత మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని సామాజిక కార్యకర్త జక్కుల లింగేశ్వర్ ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం టీసీ జారీ చేయకపోవడంతో విద్యార్థి విద్యాభ్యాసం కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లినా, పాఠశాల యాజమాన్యంపై నిబంధనల

మిగతా 6 లో... ▸

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను ప్రామాణికంగా రూపొందించాలి

- జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 7, (ప్రజాజ్యోతి)** జిల్లా జనగణన హ్యాండ్ బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించాలని జనగణన సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్) భారతి హోళీ కేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనగణన సంచాలకులు భారతి హోళీ కేరి మాట్లాడుతూ

మిగతా 2 లో... ▸

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను ప్రామాణికంగా రూపొందించాలి




(మొదటి పేజీ తరువాయి...)

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నామని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లకు ప్రత్యేక హ్యాండ్‌బుక్‌లు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లో జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తామని తెలిపారు. భవిష్యత్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణన విశ్లేషణలకు ఈ హ్యాండ్‌బుక్ ప్రామాణిక ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని అన్నారు, ప్రతి శాఖ నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి, రెవెన్యూ గ్రామం, పట్టణ స్థాయి వరకు పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సౌకర్యాలు, శాఖల అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. గృహాల జాబితా సేకరణ అనంతరం జనాభా గణాంకాలను జాతీయ స్థాయిలో విశ్లేషించి అధికారికంగా ప్రచురిస్తారని తెలిపారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌లో పొందుపరిచే ప్రతి సమాచారం సంబంధిత శాఖల అధికారిక నమోదుల ఆధారంగా మాత్రమే ఉండాలని, సమాచారం ఏకరూపంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ చేపట్టాలని, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రతి శాఖకు బాధ్యతలు కేటాయించాలని ఆదేశించారు. శాఖల వారీగా నోడల్ అధికారులను నియమించి, అవసరమైన నమూనా పట్టికలను ముందుగానే అందించాలని సూచించారు. అన్ని శాఖలు ఒకే నిర్ధారిత తేదీని ప్రామాణికంగా తీసుకొని సమాచారాన్ని అందించాలని, అధికారికంగా ధృవీకరించిన సమాచారాన్ని మాత్రమే ఉపయోగించాలని, అన్ని శాఖల్లో గణాంకాల ఏకరూపత పాటించాలని ఆదేశించారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు సమాచార నమోదు, పరస్పర పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రతి పట్టికను సంబంధిత శాఖాధికారి, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ విభాగం రెండుసార్లు పరిశీలించాలని తెలిపారు. ప్రతికూల విలువలు, ఖాళీ గడులు, పునరావృత నమోదులు లేకుండా చూసి, మొత్తాలు, ఉపమొత్తాలు సరిగా ఉన్నాయో లేదో ధృవీకరించాలని సూచించారు. గత జనగణన గణాంకాలు, ప్రస్తుత శాఖల సమాచారాన్ని పోల్చి అసాధారణ వ్యత్యాసాలు ఉంటే వాటికి కారణాలు నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశించిన నమూనా పట్టికలను మాత్రమే ఉపయోగించాలని, టైపింగ్ పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, పదాల అక్షరక్రమంలో ఏకరూపత పాటించాలని సూచించారు. గ్రామాల పేర్లు అధికారిక రెవెన్యూ నమోదుల ప్రకారమే నమోదు చేయాలని, సంకేత సంఖ్యల్లో ఎలాంటి మార్పులు చేయరాదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8లోపు జిల్లా సమగ్ర పరిచయాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. ఇందులో జిల్లా పరిచయం, భౌగోళిక స్వరూపం, పరిపాలనా నిర్మాణం, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి సూచికలు, జిల్లాకు సంబంధించిన ప్రత్యేక విశేషాలను పొందుపరచాలని సూచించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు సమాచార ధృవీకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పట్టికలో అన్ని గడులు పూర్తిగా నింపబడ్డాయా, మొత్తాలు సరిగా ఉన్నాయా, శాఖల మధ్య గణాంకాల్లో వ్యత్యాసాలున్నాయా, వివరణాత్మక సమాచారం గణాంకాలకు అనుగుణంగా ఉందా, తేదీలు సక్రమంగా నమోదయ్యాయా, అధికారిక ఉత్తర్వుల ఆధారంగానే వివరాలు నమోదు చేశారా, పటాల అనుసంధానం సక్రమంగా ఉందా అనే అంశాలను బాధ్యతాధికారులు తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ప్రతి సమాచారం ప్రామాణికత, తాజాదనం, సంపూర్ణత, ఏకరూపత అనే ఐదు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. ప్రతి దశ పూర్తయిన తర్వాత అంతర్గత నాణ్యత తనిఖీ నిర్వహించి, ప్రతి సవరణకు సంబంధించిన ఆధార పత్రాలను భద్రపరచాలని తెలిపారు. అన్ని అభ్యంతరాలను పరిష్కరించి, బాధ్యతాధికారి ధృవీకరణ అనంతరం మాత్రమే జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ పార్ట్–ఎను నిర్ణీత గడువులో రాష్ట్ర జనగణన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జనగణన సంచాలకులు ఇచ్చిన మార్గదర్శకాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల నుంచి నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరించి, పూర్తిస్థాయిలో పరిశీలన, ధృవీకరణ అనంతరం జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌కు సంబంధించిన వివరాలను నిర్ణీత కాలపట్టిక ప్రకారం రాష్ట్ర జనగణన కార్యాలయానికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పి సీఈవో నాగలక్ష్మి ,ప్రణాళికాధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూషసంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

పెన్షన్ల మంజూరు, వన మహోత్సవం తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుండి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ప్రస్తుతం వరద జలాలు వస్తున్నప్పటికీ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతులకు పంటల ప్రణాళికపై స్పష్టమైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలువల కింద వరి సాగు చేసే ప్రాంతాల్లో వరద నీరు తగ్గిన తర్వాత పంట చేతికి వచ్చే వరకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నందున రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 8వ తేదీన ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశాలు నిర్వహించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా, సాగునీటి పరిస్థితులపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలున్నందున వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల నాటకం పూర్తి చేయడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఆగస్టు 15వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా చర్యలు వేగవంతం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మండలాల వారీగా వర్షపాతం, నీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు పంట కుంటల నిర్మాణాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని, రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు నీటి వినియోగంలో మితవ్యయం పాటించేలా రైతులకు సూచనలు చేయాలన్నారు. అదేవిధంగా ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా ప్రక్రియలను వేగవంతం చేయాలని, వన మహోత్సవం కింద నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత సంబంధిత శాఖలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని కార్యక్రమాలను శాఖల మధ్య సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , జిల్లా పంచాయతీ అధికారి అనూష, సిపిఓ సునీత, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్ పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ప్రజల సంక్షేమమే ధ్యేయం... ఎమ్మెల్యే జారె

(మొదటి పేజీ తరువాయి...)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం దమ్మపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ప్రభుత్వ పనులకు శ్రీకారం చుట్టారు.

### ››› పేదల ఇంటి కలకు తొలి అడుగు

మండలంలోని పార్కలగండి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ గృహ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పారదర్శకంగా ఇళ్ల మంజూరు జరుగుతుందని స్పష్టం చేశారు.

### ››› తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు మెరుగైన వసతులు

దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం మహిళాశక్తి క్యాంటీన్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.









### ››› పచ్చదనం పెరిగితేనే భవిష్యత్ భద్రం

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ఒక్కటే కాదు, వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి ప్రతి గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితేనే రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు.

### ››› అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజల అవసరాలను గుర్తించి దశల వారీగా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో దమ్మపేట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ (తహసీల్దార్) మద్దినేని మురళి, స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సేవా స్ఫూర్తి..

- పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత




**చర్ల, ఆగస్టు 07:(ప్రజా జ్యోతి):** చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పూర్వ ప్రధానోపాధ్యాయుడు ముత్తవరపు శ్రీధర్‌బాబుతో పాటు పూర్వ విద్యార్థులు దొడ్డి సూర్యచంద్రరావు, నీలి ప్రసాద్, చింతా నాగుబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా 2005–2008 మధ్యకాలంలో చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ముత్తవరపు శ్రీధర్‌బాబు సుమారు రూ.8,500 విలువైన భారతమాత, జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించేందుకు ఈ చిత్రపటాలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు.ఈ సందర్భగా ముత్తవరపు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తానూ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన 2005–2009 సంవత్సరాల మధ్య చర్ల నివాసి కేర్ హాస్పిటల్ డైరెక్టర్ డి.ఎన్.కుమార్, అప్పటి విద్యాశాఖ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, నేదురుమల్లి రాజ్యలక్ష్మి, కలెక్టర్ శశిభూషణ్‌కుమార్ తదితరుల సహకారంతో సుమారు రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయించి విశాలమైన తరగతి గదులతో పాఠశాల భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన సమయంలో పాఠశాలలో 850 నుంచి 1,000 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసించేవారని నాటి ఉపాధ్యాయులతో సమష్టిగా కృషి చేసి పాఠశాలకు 100 శాతం ఎస్‌ఎస్‌సీ ఫలితాలు సాధించినట్లు గుర్తుచేశారు.అప్పటి ఉపాధ్యాయులుగా ముత్తవరపు శ్రీధర్‌బాబు, బండి విష్ణు, రామిరెడ్డి, పాయం కోటేశ్వరరావు, శ్రావణ్‌కుమార్ తదితరులు పనిచేసిన కాలంలో 2003 ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఆ ఏడాది 22 మంది విద్యార్థులు 520 నుంచి 573 మార్కుల వరకు సాధించారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలగా చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గుర్తింపు లభించిందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అప్పట్లో ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల విద్యా ప్రమాణాలు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాయని గుర్తుచేశారు.ప్రస్తుతం పాఠశాలలో మంచినీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పూర్వ విద్యార్థులు త్వరలోనే పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.2027 మార్చిలో జరగనున్న ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని శ్రీధర్‌బాబు సూచించారు. ఎస్‌ఎస్‌సీలో 550కు పైగా మార్కులు సాధించే విద్యార్థులకు తనవంతుగా నగదు బహుమతి అందజేసి సన్మానిస్తానని ఆయన తెలిపారు. పాఠశాల పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం పట్ల ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని పూర్వ విద్యార్థులు తెలియచేసారు .

## త్రివేణి పాఠశాలలో బోనాల సంబరాలు

- త్రివేణి పాఠశాలలో భక్తిశ్రద్ధలతో ఆషాడమాస బోనాల వేడుకలు
- చిన్నారుల బోనాలతో సందడిగా త్రివేణి పాఠశాల





**పాల్వంచ, ఆగస్టు 7, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం దమ్మపేట క్రాస్‌రోడ్‌లో ని త్రివేణి పాఠశాలలో ఆషాడమాస బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, వేపాకులు, పూల రంగవల్లులతో సుందరంగా అలంకరించారు. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు బోనం కుండలను తలపై మోసుకొచ్చి అమ్మవారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి మహా హారతి ఇచ్చారు.పూజా కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని, దేశం సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్థించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి నృత్యాలు తల్లిదండ్రులు, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు, సీఆర్వో మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు విద్యార్థులందరిపై ఉండాలని, వారికి మంచి ఆరోగ్యం, ఉన్నత విద్య, ఉజ్వల భవిష్యత్తు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కిడ్స్ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

## అంకమ్మ తల్లి ఆషాఢమాసం బోనాల మహోత్సవానికి ఆహ్వానం

- ఆగస్టు 9న జరిగే బోనాల మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు





**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ అంకమ్మ తల్లి దేవాలయంలో ఆషాఢమాసం బోనాల మహోత్సవాన్ని ఆగస్టు 9, ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ పానుగంటి రాఘవులు విలేకరుల సమావేశంలో తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం విశిష్టమైన ఆచారమని, గ్రామ ప్రజల సుఖశాంతులు, పాడిపంటల సమృద్ధి, ప్రజల ఆయురారోగ్యాల కోసం భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారని వారు పేర్కొన్నారు.ఆదివారం ఉదయం నుంచి డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాల నడుమ గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను తీసుకుని ఊరేగింపుగా శ్రీ అంకమ్మ తల్లి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించాలని భక్తులకు పిలుపునిచ్చారు.బోనాల మహోత్సవంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.విలేకరుల సమావేశంలో అన్నపురెడ్డిపల్లి సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాదాల వెంకన్న పాల్గొన్నారు.

## ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**చర్ల, ఆగస్టు 07(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ ను అందజేశారు. ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ ప్రభు త్వం అందిస్తున్న ఉచిత నోట్‌బుక్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా చదువుతూ ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా పట్టుదలతో చదవాలని సూచించారు.విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇంటర్ విద్య డైరెక్టర్ (కమిషనర్) అభిలాష అభినవ్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణాలకు ప్రిన్సిపాల్ నరేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## వనవాసీ నిలయానికి బియ్యం వితరణ




**చర్ల, ఆగస్టు 07(ప్రజా జ్యోతి ):** విద్య ప్రతి ఒక్కరి జీవితంలో కీలక పాత్ర పోషిస్తుందని, చదువు ద్వారానే వ్యక్తికి సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత అన్నారు. విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడిన అనంతరం తాను చదువుకున్న సంస్థలోని విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.చర్ల మండలం కేశవాపురం గ్రామానికి చెందిన తుర్రం శేషుబాబు హైదరాబాద్‌లోని వనవాసీ అనుబంధ శ్రీరామ విద్యాలయంలో ఆప్తమాలజీ కోర్సు పూర్తి చేసి ప్రస్తుతం అక్కడే స్థిరపడ్డారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని తాను విద్యనభ్యసించిన సంస్థకు చెందిన విద్యార్థులకు తన వంతు సహాయం అందించాలని నిర్ణయించుకున్న ఆయన చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి శుక్రవారం బియ్యం, పండ్లను వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పెద్దాడ ఆశాలత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తుర్రం శేషుబాబు ప్రతి ఏడాది తన జన్మదినం సందర్భంగా విద్యార్థి నిలయానికి వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్నారని ఆర్థిక స్థోమత ఒక్కటే వ్యక్తి ఉన్నతికి కొలమానం కాదని విద్య ద్వారా సాధించిన జ్ఞానం, ఉద్యోగం, వ్యక్తిత్వమే సమాజంలో గౌరవాన్ని తీసుకువస్తాయని ఆశాలత అన్నారు. జీవితంలో ముందుకు సాగేందుకు విద్య ఎంతో అవసరమని చదువు ద్వారా జీవన విధానంలో సానుకూల మార్పు వస్తుందని అన్నారు . విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడే వారు చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలరని ఈ దిశగా విద్యార్థి నిలయ కమిటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.విద్య, జీవన ప్రమాణాల్లో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం వనవాసీ కళ్యాణ పరిషత్ పనిచేస్తోందని విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తోందని త విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వారు చదువుతున్న పాఠశాలల ఉపాధ్యాయులతో కమిటీ సభ్యులు సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా దాతల సహకారంతో వస్తువులను సమకూర్చడం అభినందనీయమని అన్నారు. సేవాభావంతో పనిచేసే కమిటీ సభ్యుల కృషి కారణంగా విద్యార్థి నిలయం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని ఆశాలత పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, రామకృష్ణ, తుర్రం భానుప్రసాద్, సోడి అభివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న ' జైలు భరో ' జయప్రదం చేయాలి

- కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 7,(ప్రజా జ్యోతి)** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం వ్యవసాయ కార్మికుల కూలి పెంచాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ, కార్పొరేట్ విధానాలు ఆలంబిస్తున్న మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10వ తేదీన జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా జైలు బరో విజయం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను, ప్రచార వాల్పోస్టర్లను శుక్రవారం కే సత్య ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన సెంటర్లలో పంపిణీ చేస్తూ సమావేశాలు నిర్వహించారు, అనంతరం ఆమెమాట్లాడుతూ కార్మికుల హక్కుల ను కార్పొరేట్ కంపెనీలకు దానోహం చేస్తున్న మోదీ సర్కారు, వేతనాల్లో కోతలు పెట్టి, పని గంటలు పెంచి వారి శ్రమను దోచుకుంటున్న పద్ధతి కి వ్యతిరేకంగా కార్మికులు నడుం బిగించి ఉద్యమించాలని పిలుపినీచ్చారు. మరోవైపు వ్యవసాయ కార్మికులు రోజు పని లేక పని ఉన్న రోజు చాలీచాలని వేతనమిస్తూ కూలీల కంటే హీనంగా చూస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసివేసి వి బి జి రామ్ అనే పేరు పెట్టి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే పద్ధతుల్లో కార్మికుల కడుపు కొట్టి వారి భూములను కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెప్పే పద్ధతి కి వ్యతిరేకంగా ప్రతి కార్మికుడు చైతన్యవంతమై మోడీ సర్కార్ ను నిలదీయాలని అన్నారు ,రైతాంగ సమస్యలు రోజు రోజుకు తీవ్రమవుతున్న తీరు చూస్తుంటే భారతదేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టేలా ఉందన్నారు. కనీసం విత్తనాలు కూడా రైతులకు అందించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతూ ఆత్మహత్యలను ప్రేరేపించే విధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ గిట్టుబాటు ధర కల్పించకుండా చేస్తున్నరైతాంగ వ్యతిరేక పద్ధతులపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం ,వ్యవసాయ కార్మికులు ,రైతాంగం భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలన్నారు కార్పొరేట్ కంపెనీలకు తాకట్టుపెట్టి విధానాన్నిరద్దు చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దయ్య వరకు ఉద్యమించాలన్నారూ. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశాన్ని వదిలి వెళ్లాలని 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమాన్ని నిర్మించారని అన్నారు .అదే స్ఫూర్తితో నేడు క్విట్ మోడీ ట్విట్ కార్పోరేట్స్ అనే నినాదంతో ఆగస్టు 10వ తేదీన భారతదేశ వ్యాప్తంగా సకల కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించబోతున్నారని తెలిపారు. అందులో భాగంగా కొత్తగూడెం కేంద్రంగా ఆగస్టు 10వ తేదీన జైల్ భరో కార్యక్రమానికి వందలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో మోతిలాల్ కవిత. అంజమ్మ. సావిత్రి బుజ్జి. యాదమ్మ. తదితరులు పాల్గొనారు.

# నేడు పాల్వంచలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

- మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత.
- విద్యుత్ స్తంభాల మరమత్తుల నేపథ్యంలో నిర్ణయం.

**పాల్వంచ, ఆగస్టు 7, ప్రజాజ్యోతి:** విద్యుత్ నిర్వహణ, మరమ్మతుల పనుల కారణంగా ఆగస్టు 8 (శనివారం) ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పాల్వంచలోని ఇందిరానగర్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తెలిపారు.ఈ విద్యుత్ అంతరాయం లక్ష్మీదేవిపల్లి, ఇందిరానగర్ కాలనీ, రాహుల్ గాంధీనగర్, హమాలీ కాలనీ, కాంట్రాక్టర్స్ కాలనీ, బాపూజీ నగర్, వనమా కాలనీ, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, తెలంగాణ నగర్ ప్రాంతాల్లో అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు శాఖకు సహకరించాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కోరారు.

# ఐదు పంచాయతీలను తెలంగాణకు ఇవ్వాలి

- పోలవరంతో భద్రాద్రికి పెనుముప్పు
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షాబీర్‌పాషా



**చర్ల, ఆగస్టు 07:(ప్రజా జ్యోతి):** రాష్ట్ర విభజన సమయంలో అశాస్త్రీయంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. షాబీర్‌పాషా డిమాండ్ చేశారు.ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండో రోజు యాత్ర శుక్రవారం బూర్గంపాడు మండలంలోని సారపాక నుంచి ప్రారంభమై భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల మీదుగా చర్ల మండలం తిప్పాపురం గ్రామంలో ముగిసింది.ప్రజా చైతన్య యాత్రకు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ప్రజలు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నాయకులకు పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ఆహ్వానించారు. భద్రాచలం పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూరుబాక గ్రామంలోని జయరామ రెడ్డి స్మారక స్థూపం, నరసాపురం గ్రామంలోని రావులపల్లి నాగభూషణం స్మారక స్థూపాల వద్ద నివాళులర్పించారు. ఎర్రజెండాలతో సాగిన మోటార్ సైకిల్ ర్యాలీలు, పాదయాత్రలు ఆకట్టుకున్నాయి. దారిపొడవునా పార్టీ శ్రేణులు అరుణ పతాకాలను ఎగురవేయగా, ప్రజానాట్యమండలి ఆటపాటలు యాత్రలో ఉత్సాహాన్ని నింపాయి.ఈ సందర్భంగా ఎస్.కె. షాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రజల హక్కులు, అస్తిత్వం, గిరిజనుల భవిష్యత్తును పరిరక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తెలంగాణలో ఉండగా, దేవస్థానానికి సంబంధించిన భూములు, ఆస్తులు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం చారిత్రకంగా, పరిపాలనా పరంగా, ఆధ్యాత్మికంగా సమంజసం కాదన్నారు. “రాముడు ఇక్కడ.. భూములు అక్కడ” అనే విరుద్ధ పరిస్థితికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ముగింపు పలకాలని కోరారు.సీతారామ, సీతమ్మధార ప్రాజెక్టుల ద్వారా భద్రాద్రి జిల్లాకు సమృద్ధిగా సాగునీరు అందించిన అనంతరం నీటిని ఇతర ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకానికి వెంటనే నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.పోలవరం ప్రాజెక్టు భద్రాద్రి జిల్లా మనుగడకే పెను సవాలుగా మారుతోందని షాబీర్‌పాషా ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో గిరిజన గ్రామాలు, వ్యవసాయ భూములు, అడవులు, ప్రజల జీవనాధారాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి ప్రజల ఆస్తులు, ప్రాణాలు, హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రతి వర్షాకాలంలో గోదావరి వరదలు భద్రాచలం పట్టణంతో పాటు అనేక గ్రామాలను ముంపునకు గురిచేస్తున్నా శాశ్వత పరిష్కారం దిశగా పాలకులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వరద ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు నదీ తీరంలో శాస్త్రీయ ప్రమాణాలతో పటిష్టమైన కరకట్టలు నిర్మించి శాశ్వత వరద నియంత్రణ ప్రణాళికను అమలు చేయాలని కోరారు.భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. అన్ని విభాగాల్లో అవసరమైన వైద్యులను నియమించి, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పెండింగ్‌లో ఉన్న పోడు భూముల హక్కు పట్టాలను వెంటనే మంజూరు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.ఇసుక లారీల రాకపోకలతో వాజేడు నుంచి భద్రాచలం వరకు ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిన్నదని షాబీర్‌పాషా అన్నారు. ఇసుక రవాణా ద్వారా కాంట్రాక్టర్లు భారీగా లాభాలు ఆర్జిస్తుండగా ఏజెన్సీ ప్రాంత రహదారులు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములు, సహజ వనరులు, రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణ కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకుని నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముివ్వా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రెండో రోజు ప్రజా చైతన్య యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, మేయర్ మూడు గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, యు.రాహుల్, ఎస్.కె. ఫహీం, పేరాల శ్రీనివాస్, కిలిమి ఎల్లారెడ్డి, బొల్లోజు వేణు, అడ్డగర్ల తాతాజీ, నూపా పోతయ్య, నూపా తిరుపతిరావు, పాల్వంచ రామారావు, వామన్‌రావు, కోడిరెక్కల రాజారావు, కోటి ముత్యాలరావు, తాటిపూడి రమేష్, అమరవాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం జే జే బీ వై పథకం కింద ముగ్గురికి బీమా పరిహారం

- మండల అభివృద్ధి అధికారి డి. రాజేశ్వరి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ




**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలో గురువారం మధ్యాహ్నం ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎం జే జే బీ వై) పథకం కింద ముగ్గురు లబ్ధిదారులకు బీమా పరిహార చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల అభివృద్ధి అధికారి డి. రాజేశ్వరి మాట్లాడుతూ, బీమా పథకాలు ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బీమా పథకాలలో చేరి వాటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రజల్లో బీమా పథకాలపై అవగాహన పెంపొందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా బ్యాంకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంట్లం గ్రామ సర్పంచ్ కారం శివ, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సలహాదారులు కె. ప్రమీల, వి. అంజిబాబు, బీజేపీ నాయకులు బాల కిరణ్, జంగాల శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.పీఎం జే జే బీ వై పథకం కింద ముగ్గురు లబ్ధిదారులకు బీమా పరిహార చెక్కులను అందజేశారు.

# అవయవ దానం మహాదానం

- అవయవ దానంపై విద్యార్థుల్లో చైతన్యం నింపిన సదస్సు
- మానవతకు అవయవ దానం గొప్ప సేవ: గురు ప్రకాష్

**పాల్వంచ, ఆగస్టు 7, ప్రజాజ్యోతి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచలో తెలంగాణ స్టేట్ ఆర్గన్ అండ్ బాడీ డోనర్స్ అసోసియేషన్, హైదరాబాద్ సహకారంతో భాగ్య క్లబ్ ఆధ్వర్యంలో “అవయవ దానం – మహాదానం” అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జి. గురు ప్రకాష్ మాట్లాడుతూ అవయవ, శరీర దానం యొక్క ప్రాముఖ్యత, చట్టపరమైన నిబంధనలు, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఒకరి అవయవ దానం ద్వారా పలువురికి పునర్జన్మ లభిస్తుందని, ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో ముందుకు రావాలని విద్యార్థులకు సూచించారు కార్యక్రమ కన్వీనర్ టి. హరిలాల్, భాగ్య క్లబ్ కోఆర్డినేటర్ డా. ఎన్. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డా. జె. మాధవి మాట్లాడుతూ అవయవ దానంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవయవ దానం ద్వారా ప్రాణాలను కాపాడే గొప్ప సేవలో భాగస్వాములు కావాలని, సమాజంలో సానుకూల సందేశాన్ని వ్యాప్తి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.



# సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలులో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలకం

- ప్రతి మండలం రెండు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 7,(ప్రజా జ్యోతి)**

2026–27 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక , మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కార్యాచరణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సమర్థవంతమైన సాధనమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనలో జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు .భారత ప్రభుత్వం నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రతి మండలం రెండు లక్ష్యాలను ప్రాధాన్యత అంశాలుగా ఎంపిక చేసి, ఆయా లక్ష్యాలకు సంబంధించిన కనీసం 25 శాతం ప్రాజెక్టు ఆధారిత కార్యకలాపాలను మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లక్ష్యాలు గ్రామాల అవసరాలు, స్థానిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని సూచించారు.మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంపీడీవోలు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన గణాంకాలు, భౌతిక, ఆర్థిక ప్రగతి, అవసరాల వివరాలను సకాలంలో అందించి ప్రణాళికల రూపకల్పనకు సహకరించాలని ఆదేశించారు.పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు గ్రామాల వాస్తవ అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి మెరుగుదల,ఆరోగ్యవంతమైన గ్రామాలు, బాలలకు అనుకూల వాతావరణం, నాణ్యమైన విద్య, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, పచ్చదనం, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ వనరుల పెంపు కోసం గ్రామీణ పర్యాటకం, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, పౌల్ట్రీ, పశుసంవర్ధక అభివృద్ధి, సేంద్రీయ వ్యవసాయం, గ్రామ ఉత్పత్తుల జియో ట్యాగింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆదాయ వృద్ధి కార్యక్రమాలు వంటి ప్రాజెక్టులను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ శాఖల పథకాలు, నిధులు, వనరులను సమీకరిస్తూ ఫండ్ కన్వర్జెన్స్ ద్వారా గ్రామాల అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలని తెలిపారు.ప్రతి ప్రాజెక్టుకు లక్ష్యం, అంచనా వ్యయం, నిధుల వనరు, అమలు చేసే శాఖ, కాలపట్టిక, ఆశించిన ఫలితాలను స్పష్టంగా తెలుపుతూ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రూపొందించే ప్రణాళికలు గ్రామాల సమగ్రాభివృద్ధికి దోహదపడటంతో పాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఆదర్శంగా నిలవాలని అన్నారు.ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి నిర్దేశిత గడువులోగా ప్రతిపాదనలు సమర్పించాలని, శాఖల మధ్య సమన్వయంతో నాణ్యమైన జిల్లా, మండల పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా ప్రణాళిక అధికారి సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భద్రతా పింఛన్ల దరఖాస్తులు స్వీకరణ

- అర్హులైన లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలి: ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి



**దమ్మపేట, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల నుంచి వివిధ సామాజిక భద్రతా పింఛన్ల దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా స్వీకరిస్తున్నట్లు దమ్మపేట మండల అభివృద్ధి అధికారి రవీంద్ర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు తమ అర్హతలను నిర్ధారించుకుని సంబంధిత ధృవపత్రాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.వితంతు పింఛన్ కోసం 18 సంవత్సరాలు నిండిన వయస్సు, భర్త మరణ ధృవీకరణ పత్రం, వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు.ఒంటరి మహిళ పింఛన్ కోసం 18 సంవత్సరాలు నిండిన వయస్సుతో పాటు విడాకుల ధృవీకరణ పత్రం లేదా తహసీల్దార్ (ఎంఆర్వో) ధృవీకరణ పత్రం, వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు.వికలాంగుల పింఛన్ కోసం వయస్సుతో సంబంధం లేదని, కనీసం 40 శాతం వికలాంగత్వం ఉండాలని, వినికిడి లోపం ఉన్నవారికి 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వ ధృవీకరణ అవసరమని తెలిపారు.గీత కార్మికుల పింఛన్ కోసం 50 సంవత్సరాలు నిండిన వయస్సుతో పాటు గీత కార్మికుల సహకార సంఘం జారీ చేసిన ధృవీకరణ పత్రం, నేత కార్మికుల పింఛన్ కోసం 50 సంవత్సరాలు నిండిన వయస్సుతో పాటు హ్యాండ్లూమ్ శాఖ జారీ చేసిన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.అన్ని పింఛన్ దరఖాస్తుదారుల వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉండాలని, భూమి పరిమితి తరి భూమి 3 ఎకరాలు, మెట్ట భూమి 7.5 ఎకరాలకు మించరాదని ఎంపీడీఓ తెలిపారు.పింఛన్ దరఖాస్తు నమూనాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద పొందవచ్చని, దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన (ఫీల్డ్ వెరిఫికేషన్) అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయబడతాయని పేర్కొన్నారు.ప్రస్తుతం వృద్ధాప్య (ఓల్డ్ ఏజ్) పింఛన్ల దరఖాస్తులు స్వీకరించడం లేదని ప్రజలు గమనించాలని ఎంపీడీఓ స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులు నిర్ణీత పత్రాలతో త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## జ్ఞానానికి పరీక్ష.. ప్రతిభకు వేదిక.. ఆశ్రమ పాఠశాలల్లో క్విజ్ పోటీలు

- పోటీ స్ఫూర్తే విజయానికి తొలి మెట్టు : ఐటీడీఏ పీవో బి. రాహుల్







**దమ్మపేట, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి):** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి, మేధాశక్తి, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్విజ్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.శుక్రవారం దమ్మపేట మండలం అంకంపాలెంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన పాఠశాల స్థాయి క్విజ్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను పరిశీలించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్న తీరును అభినందించిన ఆయన, పోటీలు కేవలం గెలుపు కోసం కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఒక మంచి వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదువుతో పాటు ఖాళీ సమయాల్లో ఒకరినొకరు జనరల్ నాలెడ్జ్, సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు చెప్పుకునే అలవాటు చేసుకుంటే విషయాలపై లోతైన అవగాహన పెరుగుతుందని తెలిపారు. దీంతో తరగతి గదిలో బోధించే పాఠాలు మరింత సులభంగా అర్థమవడమే కాకుండా పరీక్షల సమయంలో భయం, ఆందోళన లేకుండా ఆత్మవిశ్వాసంతో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు.గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు దశలవారీగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 11న ఏటీడీవో స్థాయి పోటీలకు పంపుతారని, అక్కడ విజేతలైన వారు ఈ నెల 13న ఐటీడీఏ స్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.ఐటీడీఏ స్థాయిలో విజేతలుగా నిలిచిన పాఠశాలలకు పాఠశాల అభివృద్ధి కోసం మొదటి, రెండో స్థానాలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ తరహా పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పోటీ స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ ఎం. మురళి, ఏటీడీవో చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయురాలు శారద, డిప్యూటీ వార్డెన్ నాగమణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- లేబర్ కోడ్లు రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి : సీఐటీయూ



**దమ్మపేట, ఆగస్టు 7 (ప్రజాజ్యోతి ):** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక హక్కులను పరిరక్షించే చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు డిమాండ్ చేశారు.శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై దమ్మపేట ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్మికులు ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లతో నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న "జైలు భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమానికి విరుద్ధంగా ఉన్న విధానాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రతతో పాటు అన్ని చట్టబద్ధమైన సంక్షేమ సౌకర్యాలను కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక నాయకులు విజయలక్ష్మి, యశోద, మల్లేశ్వరి, భవాని, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి టీసీ జారీ చేయడంలో జాప్యం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రకారం చర్యలు తీసుకుని విద్యార్థికి వెంటనే టీసీ అందేలా చూడాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వర్తించలేదని విమర్శించారు. విద్యార్థుల విద్యా హక్కులను పరిరక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ నిర్వహించాలని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత విద్యార్థికి తక్షణమే ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ అందజేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే లోకాయుక్త, రాష్ట్ర విద్యాశాఖతో పాటు ఇతర సంబంధిత అధికారులను ఆశ్రయించి న్యాయపరమైన చర్యలు చేపడతామని జక్కుల లింగేశ్వర్ హెచ్చరించారు.


## ఓటు హక్కు వినియోగించుకోవాలి - బీఎల్‌వోల సేవలు అభినందనీయం



**ఇల్లందు, ఆగస్ట్ 7 (ప్రజా జ్యోతి)** 13వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం విజయవంతంగా పూర్తైన సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ దండు సారయ్య బీఎల్ఓలు ఆదిలక్ష్మి , హైమావతిలను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో బీఎల్ఓలు ఆదిలక్ష్మి , హైమావతి సమర్థవంతంగా పనిచేశారని అభినందించారు. అనంతరం వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## 40–50 ఏళ్ల చరిత్రకు చెక్..!

- **పాత వాటర్ ట్యాంక్ ఎక్కడికి పోయింది..?**
- **కాంగ్రెస్ నాయకులు ఎత్తుకుపోయారనే ఆరోపణలు – మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖల మౌనం వెనుక మర్మమేంటి?**



**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి ఆగస్టు 7** దశాబ్దాలుగా ప్రజలకు ఉపయోగపడిన 40–50 ఏళ్ల నాటి వాటర్ ట్యాంక్ అదృశ్యమవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ట్యాంక్‌ను కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు తొలగించి తీసుకెళ్లారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, దీనిపై మున్సిపల్ శాఖ గానీ, ఇరిగేషన్ శాఖ గానీ ఇప్పటివరకు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ ప్రభుత్వ ఆస్తిని తొలగించే ముందు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారా? వేలం నిర్వహించారా? లేక ఎలాంటి అధికారిక ప్రక్రియ లేకుండానే తరలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల్లో ఉత్కంఠ ప్రభుత్వ ఆస్తి అదృశ్యమైతే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలు 40–50 ఏళ్ల నాటి వాటర్ ట్యాంక్‌ను ఎవరు తొలగించారు? తొలగించడానికి అధికారిక అనుమతి ఎవరు ఇచ్చారు? మున్సిపాలిటీ లేదా ఇరిగేషన్ శాఖకు సమాచారం ఉందా? ప్రభుత్వ ఆస్తి అయితే వేలం ప్రక్రియ ఎందుకు చేపట్టలేదు? ట్యాంక్ ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఈ వ్యవహారంపై విచారణకు అధికారులు ముందుకు వస్తారా? ప్రజల డిమాండ్ ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, విజిలెన్స్ లేదా సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ ఆస్తి అక్రమంగా తరలించిన కాంగ్రెస్ నాయకులపై మరియు పాత ఇనుప దుకాణదారుడు పై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# డిపిఆర్ లోనే.. రూ. 8 కోట్ల స్కాం

(మొదటి పేజీ తరువాయి...)

సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్పొరేషన్ ఇప్పటికే దాదాపు రూ. 222 కోట్ల అప్పుల భారంతో కుదేలై ఉంటే, తగిన ఆదాయ వనరులు లేని పరిస్థితుల్లో మళ్లీ రూ. 600 కోట్ల రుణం తెచ్చి ప్రజలపై మోయలేని భారాన్ని మోపడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. నాయకులగూడెం నుంచి పెద్దమ్మతల్లి ఆలయం వరకు 6 లైన్ల రహదారి నిర్మిస్తామంటూ చేస్తున్న ప్రతిపాదనల వెనుక సాంకేతిక, ఆర్థిక సాధ్యతలను బహిరంగంగా వివరించకుండా ప్రజలను, కౌన్సిల్ సభ్యులను చీకటిలో ఉంచారని విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధుల సైద్ధాంతిక వైఖరిని దుర్గాప్రసాద్ తీవ్రంగా ఎండగట్టారు. గతంలో జలగం వెంకటరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొత్తగూడెం అభివృద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు నిధుల కోసం ప్రయత్నిస్తే అప్పటి మాజీ ఎమ్మెల్యే, నేటి కమ్యూనిస్ట్ ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు ప్రపంచ బ్యాంకు నిధులను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. అప్పుడు ప్రపంచ బ్యాంకు నిధులను తీవ్రంగా నిరసించిన అదే కమ్యూనిస్ట్ నేత, నేడు ఎమ్మెల్యేగా ఉంటూ కార్పొరేషన్ ద్వారా ప్రపంచ బ్యాంకు నిధుల కోసం ఎందుకు తహతహ ఆడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. కమ్యూనిస్టుల సిద్ధాంతాలకు, అధికారంలో ఉన్నప్పుడు ప్రవర్తించే తీరుకు ఉన్న ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. వెంటనే ఈ అక్రమాల డీపీఆర్ ప్రక్రియను నిలిపివేసి రీకాల్ చేయాలని, పూర్తి నివేదికను ప్రజలు మరియు కౌన్సిల్ ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ గోల్‌మాల్‌పై స్వతంత్ర విజిలెన్స్ విచారణ జరిపించి, ఈ స్కాంలో భాగస్వాములైన అధికారులను మరియు వెనుకున్న సూత్రధారులను కఠినంగా శిక్షించాలని దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు.

## ప్రజల ప్రాణ భద్రతే ముఖ్యం...

# రహదారి విస్తరణలో జాప్యం తగదు

- **నష్టపరిహారం చెల్లించి అడ్డంకిగా ఉన్న ఇంటిని తొలగించాలి – బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ**
- **ఆలస్యం చేస్తే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరిక**



**అశ్వాపురం, ఆగస్టు 7 ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలో అశ్వాపురం నుంచి గొందిగూడెం రహదారి విషయం, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, రహదారి విస్తరణ పనులకు అడ్డంకిగా ఉన్న నిర్మాణాన్ని చట్టబద్ధమైన నష్టపరిహారం అందించి వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. అశ్వాపురం మండల కేంద్రం నుంచి గొందిగూడెం, తుమ్మలచెరువు, మొండికుంట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ఆయుర్వేద ఆసుపత్రి సమీపంలోని ప్రమాదకర మూలమలుపు వద్ద శుక్రవారం దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గద్దల రామకృష్ణ మాట్లాడుతూ, ఈ రహదారి మండలంలోని అనేక గ్రామాలకు ప్రధాన రాకపోకల మార్గమని, ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, అత్యవసర సేవల వాహనాలు ఈ మార్గాన్ని వినియోగిస్తున్నాయని తెలిపారు. అయితే మూలమలుపు వద్ద రహదారి అత్యంత ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ప్రమాద పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో స్పందించకపోవడం విచారకరమన్నారు. పెద్ద ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రహదారి విస్తరణ పనులు ప్రజా ప్రయోజనం కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమమని, ఈ క్రమంలో ఎవరికీ అన్యాయం జరగకుండా సంబంధిత ఇంటి యజమానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించి నిర్మాణాన్ని తొలగించాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను, వ్యక్తిగత హక్కులను సమతుల్యం చేస్తూ సమస్యను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి వెంటనే ఈ సమస్యను పరిష్కరించి రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు ఒక్క అడ్డంకి కారణంగా నిలిచిపోవడం సమంజసం కాదని అన్నారు. రహదారి విస్తరణ పూర్తయితే గొందిగూడెం, తుమ్మలచెరువు, మొండికుంట గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్లకు తరలించగలరని, విద్యార్థులు, ఉద్యోగులు కూడా ఇబ్బందులు లేకుండా ప్రయాణించగలరని పేర్కొన్నారు. "ప్రజల ప్రాణ భద్రత కంటే ఏ అంశం గొప్పది కాదు. ఒక ఇంటి కారణంగా వందలాది మంది ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్థితి ఉండకూడదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా నష్టపరిహారం చెల్లించి రహదారిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి" అని గద్దల రామకృష్ణ స్పష్టం చేశారు. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రభుత్వ యంత్రాంగం తొలి బాధ్యత అని, ఈ విషయంలో ఇకపై ఎలాంటి ఆలస్యం సహించబోమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు మేకల భాస్కర్, మడిపల్లి రమేష్, మడిపల్లి రమణయ్య, అరసవిల్లి పవన్, నరేష్ వరప్రసాద్, నాగేష్, కందుల సాయి రాము తదితరులు పాల్గొని రహదారి విస్తరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

## లక్ష్మీపురంలో ట్రాఫిక్‌కు చెక్.. 'నో పార్కింగ్' బోర్డుల ఏర్పాటు

- **రోడ్డు రద్దీ నివారణకు బూర్గంపాడు పోలీసుల వినూత్న చర్య**
- **ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ముందడుగు.. లక్ష్మీపురంలో పది నో పార్కింగ్ బోర్డులు**

**బూర్గంపహాడ్, ఆగస్టు 7 (ప్రజా జ్యోతి):** రోడ్డుపై లారీ,ట్రాక్టర్ల రద్దీని తగ్గించి, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా మొత్తం 10 "నో పార్కింగ్" బోర్డులను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం స్థానిక ఎస్ఐ మేడ ప్రసాద్, నాగభిక్షం ఆధ్వర్యంలో నిర్వహించారు. రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించి, రహదారులపై వాహనాలను పార్కింగ్ చేయకుండా సహకరించాలని, తద్వారా ప్రమాదాలను నివారించి ట్రాఫిక్‌ను సజావుగా కొనసాగించవచ్చని పోలీసులు సూచించారు.

